# సరోజిని

రచన :
శ్రీ సన్యాసిరాజు

రెండు వేడి హృదయాల మధ్య నలిగిన కుసుమాలు వాడి వాసన వీడి వెల వెల పోతున్నాయి. కిటికీల్లోంచి లేత సూర్యకిరణాలు సరోజినిని తట్టి లేపుతున్నాయి. నిద్రమత్తులో తెలివి తెచ్చుకుని బద్ధకంగా ఒళ్లు విరచింది. నలిగిన సంపంగి పువ్వులు చామంతి పువ్వులు జడ ముడిలో నుంచి రాలిపోయాయి. సరోజిని కళ్లు మూసి ఒళ్ళు విరచి ఆవలించింది. కళ్లు నులుపుకుని లేచి ఎదురుగా నున్న వెంకటేశ్వరుని పఠానికి నమస్కరించింది. ప్రక్కనున్న నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూచుకుంది. ఏదో అసహ్యత్వలోన ఆవరించి చర చరా వెళ్ళిపోయింది.

ఇంట్లో వున్న ముసలమ్మ తెచ్చిన కాఫీ త్రాగి పడక కుర్చీలో కూచుంది. రాత్రి తాననుభవించిన బాధా యాతన స్ఫురించాయి. ఒళ్లు నొప్పి, కళ్లు మంట, కాళ్లు పీకు శరీరాన్ని ముద్ద చేసినట్టు ఏవో బాధలు. జీవితంలో అనుభవంలేని బాధలు. ముసలమ్మను కేకవేసి మరో కప్పు కాఫీ తెప్పించుకొని త్రాగింది. ఎదురుగా నున్న నిలువు టద్దంలో తిరిగి తన ప్రతిబింబాన్ని చూచుకుంది. ఏదో నీరసం. ముఖ కమలంలోని జీవకళలు పోతున్నాయా అనే భ్రమ. అద్దం ముందు మరి నిలబడలేకపోయింది. అతి నీరసంగావచ్చి ప్రక్కనున్న కుర్చీలో కూలబడింది.

గతించిన గాథల్ని సింహావలోకనం చేసుకునేసరికి సరోజినికి ఆశ్చర్యం వేసింది. భయంతో కూడిన ఆశ్చర్యం, తొల్లిటి రోజుల్లోని ఉత్సాహం, ఉద్రేకం, సౌందర్యం, తళతళలు ఏమయాయ్? నిరుత్సాహంతో కళ్ళు జిగ్గుమన్నాయి. ఫెడీమని లెంపకాయ కొట్టి నట్టయింది.

మానవ హృదయాల లోతుల్ని, రీతుల్ని, ఆరు సంవత్సరాల నుంచీ చూస్తోంది, ఎంత మందినో తనముందు ఆడించి, పాడించి బుట్టలోవేసి విసరేసింది. గజ్జెకట్టి నాట్యమాడి రూపాయల గలగలతో పెట్టెలు నింపుకుంది. కాని యీ విధంగా ఎప్పుడూ వ్యాకుల పడలేదు.

గతించిన రాత్రి సంఘటనే సరోజిని హృదయంలో కల్లోలం. సాయంకాలం భాగా అలంకరించుకుని నైలాన్ చీరె జాకెట్టు కట్టుకొని నూర్జహాన్ సెంటు వాసనలతో అప్పుడే తెచ్చిన గులాబీ పువ్వుల నలంకరించుకొని వీధి గుమ్మానికి ఆనుకుని నిలబడింది. ఒక ఆంగ్లో ఇండియన్ అప్పుడే స్టీమరునుంచి దిగివచ్చాడు. బాగా కండలు తిరిగివున్న మనుష్యుడు సరోజినిని చూశాడు. చూపులతో ఆహ్వానించింది, లోనికి వెళ్ళాడు. ఆమె సౌందర్యాన్ని పీల్చి పిప్పిచేశాడు. సరోజిని అతనిని పూవూలోని మకరందాన్ని భ్రమరము గ్రోలిన విధముగా తను పీల్చుకుంది. అతడు వచ్చిన పని పూర్తికాగానే సరోజిని డబ్బు అడిగేసరికి చిటుకగొట్టి వెళ్ళిపోయాడు.

సరోజిని ఓడిపోయింది. తలపోయినంత అవ

మానం. వీధిలో తల ఎత్తుకు తిరగడానికి ప్రాణాలు పోతున్నాయి. తన వృత్తిమీద విపరీతమైన రోతపుట్టింది. ఇక ఏమైనా వ్యభిచార వృత్తివల్ల జీవనం గడపకూడదని నిశ్చయించుకొని భావి జీవిత నిర్వాహణానికి పునాదులు త్రవ్వుతోంది. ఇంతలో సరోజిని అన్న రమేష్ తూలుకుంటూ, తూలుకుంటూ వచ్చి వందరూపాయలు కావాలన్నాడు. డబ్బు అవసరం వచ్చినప్పుడల్లా చెల్లెలు దగ్గరకు వస్తాడు. చెల్లెలు డబ్బు యివ్వకపోతే బాకు బయటకు తీస్తాడు. వాడి బాధపడలేక అడిగినంత డబ్బూ యిస్తూంది సరోజిని. వాడే లేకపోతే సరోజిని యీ పాటికి పెద్ద పెద్ద మేడలు కట్టించేది అనేవారు. నిజం కూడా అంతే. సరోజిని అన్నయ్య తూలుకుంటూ వచ్చి డబ్బు ఇవ్వమని గట్టిగా అడిగాడు. దానితో సరోజిని తాళాలు విసరింది. పెట్టె ఉత్తదిచేసి జేబు నింపుకుని అతివినయంగా తాళాలు యిచ్చేడు.

'అన్నయ్యా' అంది సరోజిని.

వెళుతున్నవాడు తిరిగివచ్చి చెల్లెలు దగ్గర నిలుచున్నాడు. 'రేపటి నుంచి మరి దబ్బుకోసమని మాత్రం రాకు' అంది. 'ఏం' అన్నాడు గట్టిగా. ఈ రోజుతో యీ వృత్తి మానేస్తున్నా. అంత ప్రమాదం ఏవచ్చింది...... నన్నే మాయ చేద్దామనుకుంటున్నావా పిచ్చిదానా! సరోజిని ఏడుస్తూ కూర్చుంది. నాకు తొందరగా పనుంది. తిరిగివస్తాలే, అనుకుంటూ వెళ్ళిపోయాడు.' జ్ఞానంలేని మనిషి ఉత్త పశువు అనుకుంది సరోజిని-

మూడుగంటలైంది. సరోజిని భోజనం చెయ్యలేదు. ముసలమ్మ రెండుమూడు సార్లు వచ్చింది కాని లేపటానికి ధైర్యం చాలక వెళ్ళిపోయింది. తిరిగి ముసలమ్మ వచ్చేసరికి సరోజిని లేచికూర్చుంది. కొద్దిగా బద్ధకంగా వుంది. లే అమ్మా ఒక్క మెతుకు తిందుగాని అంది ముసలమ్మ. వద్దు నాకొద్దు కొంచెం కాఫీ చేసి తీసుకురా ముసలమ్మ కదల్లేదు. ఏమిటాలోచిస్తున్నావు? కాఫీ గుండా, చక్కెర రెండు నిండుకున్నాయి. యింకా...' బియ్యం కూడా అయిపోయాయి ఈ రోజు వారం ఆఖరు! సరోజిని లేచి పెట్ట తీసిచూచింది. ఒక్క నయాపైసా కూడా లేదు, చాల విచారించింది.

సాయంత్రం అయింది. మరునాటి బోజనానికి ముస్తాబై వీది గుమ్మం దగ్గర నిలుచోక తప్పిందికాదు. సరోజినికి.

రెండు వేడి హృదయాలమధ్య నలగడానికి సిద్ధంగా ఉన్న కుసుమాలు వికట మందహాసాలు చేస్తున్నాయి.

---

మాష్టరు: ఒరేయ్! నాకు కోపంవచ్చి తన్నేనంటే మీ యింట్లోపోయిపడాలి. జాగ్రత్త.
పిల్లవాడు: పోనియిలెండి, రిక్షా బాడుగ తగ్గుతుందిలెండి.

వి. యన్. శాంతకుమార్, గుంటూరు.

* * *

మంగలి:-(క్షౌరముచేసి) ఐదణాలు ఇవ్వండి.
కాపువాడు:-(కోపముతో) ఏమి ప్రతిసారి నాలుగణాలు కదా నీవు చార్జి చేసేది?
మంగలి:-ఈ దినము మీ ముఖము కొంచెము పొడుగ్గా వున్నదండీ.

జే. సత్యనారాయణ బళ్ళారి.